గాంధీ కలలు సాకారం

● రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: సచివాలయాల ఏర్పాటుతో గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారమైందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం దేవనకొండ మండలం పాలకుర్తి గ్రామంలో మంత్రి పర్యటించారు. ముందుగా రూ.45 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని గ్రామ సర్పంచ్ గొల్ల సుధారాణితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూడున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు. గ్రామంలో మరిన్ని అభివృద్ధి పథకాలకు రూ.20 లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. పార్టీలకతీతంగా ప్రభుత్వ ఫలాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ప్రజలను కోరారు. అనంతరం లక్కందిన్నె గ్రామంలోని చర్చిని సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మిదేవి, జెడ్పీటీసీ రామకృష్ణ, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణరెడ్డి, ప్రేమనాథ్‌రెడ్డి, ప్రతాప్, నరసింహయ్య, మోహన్‌రెడ్డి, బాషా, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఆలూరు మండల కన్వీనర్ వీరేష్, ఉమాంబ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వీడండి

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వీడాలని మంత్రి గుమ్మనూరు జయరాం అధికారులను హెచ్చరించారు. పాలకుర్తి, లక్కందిన్నె గ్రామాల్లో పలువురు బాధితులు అధికారులపై మంత్రికి ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ సుదర్శనం వ్యవహార శైలిపై పార్టీ నాయకులు ఫిర్యాదు చేయడంతో తీరు మార్చుకోవాలని సూచించారు. ప్రతి అధికారి బాగా పని చేస్తేనే ప్రభుత్వానికి మంచి పేరొస్తుందన్నారు. ఇకపై జవాబుదారీతో పని చేయాలని సూచించారు.

మంత్రికి సన్మానం

కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర పదవీ కాలాన్ని పొడిగించడంతో మంత్రి జయరాంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఆలూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆస్పరి సర్పంచ్ మూలింటి రాధమ్మతో కలిసి రాఘవేంద్ర మంత్రిని సన్మానించారు. కార్యక్రమంలో దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, ఆస్పరి సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.




పాలకుర్తిలో మహిళకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం, మంత్రిని సన్మానిస్తున్న ఆస్పరి సర్పంచ్ రాధమ్మ, రాఘవేంద్ర

ప్రజలకు అవగాహన కల్పించండి

నందవరం: దంత, కంటి సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించి వైద్యం చేయించుకునేలా చైతన్యం చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రకాంత్ యాదవ్ ఆశా వర్కర్లకు సూచించారు. బుధవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లకు దంత, కంటి సమస్యలు, వాటిని శుభ్రం చేసుకునే పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దంత, కంటి సమస్యలు వివరించి, వాటిని నివారణ పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకునేలా చూడాలన్నారు. సమావేశంలో సీహెచ్‌ఓ బలరాం, సూపర్‌వైజర్ సుశీలబాయి పాల్గొన్నారు.

చెట్నెహళ్లిలో పొలంబడి

మంత్రాలయం రూరల్: మండలంలోని చెట్నేహళ్లి గ్రామంలో వ్యవసాయశాఖ ఏడీఏ ఖాద్రి, ఏఓ జీరా గణేష్ ఆధ్వర్యంలో పొలం బడి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పరిసరాల పర్యావరణ విశ్లేషణ కార్యక్రమంలో భాగంగా వేరుశనగ పంట స్థితిపై రైతులకు అవగాహన కల్పించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. సర్పంచ్ ఆంజినేయులు, ఉప సర్పంచ్ వీరనాగుడు,అధికారులు ఉన్నారు.

క్లుప్తంగా

భూమి కేటాయించండి



వినతిపత్రాన్ని అందజేస్తున్న మాజీ సైనికులు

మద్దికెర: దేశ సేవ చేసిన తమకు ఐదు ఎకరాల వ్యవసాయ భూమి, ఐదు సెంట్ల ఇంటి స్థలం కేటాయించాలని మాజీ సైనికులు భాస్కర్‌రెడ్డి, గోపాల్, కేశవరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానిక ఆర్‌ఐ రవికుమార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

ఉపాధి పనులు కల్పించండి

కృష్ణగిరి: గ్రామాల్లో కూలీలు వలస వెళ్లకుండా పనులు కల్పించాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో వలసలు ప్రారంభమయ్యాయని, పనులు కల్పించి నివారించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏపీఓలు అబ్దుల్‌షుకూర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

సహకార సంఘం చైర్‌పర్సన్ రాజీనామా



ప్రమీలమ్మ

మద్దికెర: స్థానిక ప్రాథమిక సహకార సంఘం చైర్ పర్సన్ ప్రమీలమ్మ తన పదవికి బుధవారం రాజీనామా చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం, వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నానన్నారు. తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చినందుకు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి కృతజ్ఞతలు తెలిపారు. 17 నెలలపాటు ప్రతి ఒక్కరి సహకారంతో సహకార సంఘం బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించానన్నారు.

ఆర్డీటీ ఆధ్వర్యంలో భూ అభివృద్ధి పనులు

తుగ్గలి: ఆర్డీటీ ఆధ్వర్యంలో పేద రైతుల పొలాల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. బుధవారం మండల పరిధిలోని ఉప్పర్లపల్లిలో 35 మంది రైతుల పొలాల్లో భూ అభివృద్ధి పనులను సంస్థ ఏరియా టీం లీడర్ రెహనాబీ ప్రారంభించారు. ఒక్కో రైతు పొలంలో 4 గంటల చొప్పున గుట్టలు, రాళ్లు, కంపచెట్లను జేసీబీతో తొలగించే పనులు చేపట్టామన్నారు. చిగుర్లగుట్టతండాలోనూ 32 మంది రైతుల పొలాల్లో భూ అభివృద్ధి పనులు చేపట్టారు. కార్యక్రమంలో సంస్థ సీఓ రామాంజనేయులు, సీడీసీ సభ్యుడు శ్రీరాములు పాల్గొన్నారు.

పందెంరాయుళ్ల పరార్

● రెండు కోళ్లు, ఏడు బైక్‌లు స్వాధీనం

ఎమ్మిగనూరు రూరల్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా పట్టణంలోని కలుగొట్ల రోడ్డు తోళ్ల దుకాణం వెనుక బుధవారం సాయంత్రం కొందరు సంప్రదాయ కోడి పందేలు నిర్వహించారు. విషయం ఆనోటా ఈనోటా పాకి పోలీసులకు తెలియడంతో వారు అక్కడికి చేరుకునేలోపు పందెం రాయుళ్లు కోళ్లను వదిలిపెట్టి పరారయ్యారు. ఐదుగురు అనుమానితులను, ఏడు ద్విచక్ర వాహనాలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అలాగే రెండు కోళ్లను స్వాధీనం చేసుకుని కోళ్ల ఫారానికి తరలించారు. ఇదే విషయమై టౌన్ ఏఎస్‌ఐ కిష్టప్పను వివరణ కోరగా పందెం రాయుళ్లు పరారైనట్లు చెప్పారు.

19 నుంచి అభిప్రాయ సేకరణ

వెల్దుర్తి: ఈనెల 19, 20, 21 తేదీలలో డోన్ విద్యుత్ ఈఈ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల అభిప్రాయ సేకరణ ఉంటుందని విద్యుత్ శాఖ మండల అధికారి రాఘవేంద్రప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ విద్యుత్ ధరల నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఇండస్ట్రీస్, గృహ వినియోగదారుల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. వినియోగదారులు డోన్ ఈఈ కార్యాలయంలో జరిగే వీసీలో పాల్గొని తమ అభిప్రాయాలను తెలపాలని ఏఈ పేర్కొన్నారు.

పథకాలు లబ్ధిదారులకు చేరాలి

ఎమ్మిగనూరు రూరల్: ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికీ చేరాలని ఎంపీడీఓ బంగారమ్మ సూచించారు. బుధవారం మండల పరిధిలోని కందనాతి గ్రామంలోని సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను, అమలు చేస్తున్న చార్ట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ సమస్యలపై సచివాలయం వచ్చిన వారిపట్ల మర్యాదగా ఉండాలని, వారి సమస్యను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. పింఛన్లు అర్హులైన వారికి అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆమె వెంట ఈఓఆర్డీ విజయలక్ష్మి ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలి



మాట్లాడుతున్న డీపీఎం నరసమ్మ

కృష్ణగిరి: పొదుపు సంఘాల సభ్యులతో ప్రతి నెల గ్రామాల్లో సంఘ సమావేశాలు తప్పక నిర్వహించాలని జిల్లా జీవనోపాధుల డీపీఎం నరసమ్మ ఆదేశించారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి కార్యాలయంలో బుధవారం ఏపీఎం దాసన్న అధ్యక్షతన జరిగిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో వివిధ రకాల జీవనోపాధుల కింద తీసుకున్న సీఐఎఫ్, శ్రీనిధి, హెచ్‌డీఎఫ్, ఉన్నతి రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. మండల సమాఖ్య సమావేశానికి గ్రామ సంఘం అధ్యక్షులు తప్పక హాజరు కావాలన్నారు. మూలధన నిధి కింద ఎస్‌ఆర్‌ఎల్‌ఎం నుంచి వారం పాటు నిల్వ ఉండే ఆహార పదార్థాలు తయారు చేసే మహిళలకు రూ.40 వేల రుణం మంజూరు చేయనున్నట్లు చెప్పారు. పెద్ద తరహా ఆహార తయారీ యూనిట్ ఏర్పాటుకు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణం మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఇందులో 35 శాతం సబ్సిడీ పోనూ 10 శాతం లబ్ధిదారులు చెల్లించాల్సి ఉండగా మిగిలిన 55 శాతం బ్యాంకు ద్వారా రుణం ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో తీసుకున్న రుణాలను కూడా సకాలంలో వసూలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఏపీఎం అశోక్, కన్సల్టెంట్ జీషన్, ఎల్‌సీ ఇమామ్, గ్రామ సంఘాల అధ్యక్షులు, సీసీలు, వీఓలు పాల్గొన్నారు.

22 నుంచి ఆరాధన

ఆస్పరి: మండలంలోని తంగరడోణ గ్రామంలో వెలసిన చింతలమునిస్వామి, నల్లారెడ్డి స్వామి ఆరాధనోత్సవాలు ఈనెల 22, 23వ తేదీలలో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పార్వతి బుధవారం తెలిపారు. రెండు రోజుల పాటు ఆలయాల్లో గంగ, ఆకు పూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆరాధనోత్సవాలకు వచ్చే భక్తులకు ఏర్పాట్లు చేసినట్లు చైర్‌పర్సన్ తెలిపారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

ఆస్పరి: ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ కృష్ణమోహన్ కూలీలకు సూచించారు. బుధవారం మండలంలోని శంకరబండ, హలిగేర గ్రామాల పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో కాలువ, చెరువులలో పూడిక తీత పనులు జరుగుతున్నాయన్నారు. వలసలు వెళ్లకుండా పనులు కల్పిస్తున్నామన్నారు. పండ్ల తోటలు పెంచుకునే రైతులకు సబ్సిడీ ఇస్తున్నామని, ఆసక్తి ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎస్.నాగాలపురంలో నేడు ఉరుసు

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని ఎస్.నాగాలపురంలో గురువారం దస్తగిరిస్వామి, మౌలాలి స్వామి ఉరుసు మహోత్సవం జరగనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. బుధవారం స్వామి గంధం, గురువారం ఉరుసు మహోత్సవం ఉంటుందని, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటారని వారు చెప్పారు.

20 వరకు రేషన్ పంపిణీ

తుగ్గలి: ఈనెల 20వ తేదీ వరకు రేషన్ పంపిణీని పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తహసీల్దార్ రవి బుధవారం తెలిపారు. మండలంలో రేషన్ పంపిణీ 88 శాతం వరకు పూర్తయిందన్నారు. మిగిలిన వారు కూడా రేషన్‌ను సద్వినియోగం చేసుకునేలా పంపిణీ గడువును 20 వరకు ప్రభుత్వం పొడిగించిందన్నారు. కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా గంధోత్సవం

తుగ్గలి: మండల పరిధిలోని నల్లగుండ్ల మునిస్వామి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా బుధవారం గంధోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మేళతాళాలతో గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి దర్గాలో పక్కీరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామస్తులు గంధం ఉత్సవాన్ని తిలకించారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

చిప్పగిరి: మండలంలోని నంచర్ల అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓ లలిత బుధవారం తనిఖీ చేశారు. 1, 2, 3 కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. మెనూ ప్రకారం బాలింతలకు, చిన్నపిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని అక్కడి కార్యకర్తలకు సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన రాజు

ఆదోని అర్బన్ : ఈనెల 16న జరిగిన సీనియర్ కబడ్డీ క్రీడాకారుల ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపిన ఆదోని విద్యార్థి డి.కె.రాజు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు పీఈటీ అసోసియేషన్ సభ్యులు రామన్న, హరిబాబు, సీనియర్ క్రీడాకారులు చిన్నా, హుసేని, కృష్ణ, చంద్ర, సురేంద్ర పోటీలకు ఎంపికైన రాజును అభినందించారు. రామన్న మాట్లాడుతూ పీఈటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజుకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చామని చెప్పారు. రాజు ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చదువుకున్నాడని, ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు విశాఖపట్నంలోని అంకుపాలెంలో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ కబడ్డీ పోటీల్లో కర్నూలు తరఫున పాల్గొంటాడని వివరించారు.

ఫిల్టర్‌బెడ్‌కు మరమ్మతులు

హొళగుంద: స్థానిక పంప్‌హౌస్ వద్ద ఉన్న ఫిల్టర్‌బెడ్‌కు బుధవారం మరమ్మతులు చేపట్టారు. ఫిల్టర్‌బెడ్‌లో గడ్డి, పాచి పేరుకుపోవడంతో పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ కూలీలతో పనులు చేయించారు. ఎల్లెల్సీ నీటిని ఎస్ఎస్ ట్యాంక్‌లో నిల్వ చేసి ఫిల్టర్‌బెడ్ ద్వారా గ్రామంలోకి విడుదల చేస్తున్నారు. గడ్డి, పాచి కారణంగా నీరు కలుషితమవుతుండడంతో పంచాయతీ నిధులతో మరమ్మతులు చేపట్టినట్లు సెక్రటరీ తెలిపారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

తుగ్గలి: మండల పరిధిలోని గిరిగెట్ల గ్రామంలో మూడు ముఖాల అంకాలమ్మ ఆలయ అభివృద్ధికి సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.మురళీధర్‌రెడ్డి బుధవారం రూ.30 వేలు విరాళం అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం నగదును ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు సీతారామిరెడ్డి, హనుమంతు, పెద్ద రంగన్న, రణధీర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాబోర్డు ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరు: కృష్ణానది మేనేజ్‌మెంట్ బోర్డు కర్నూలు జిల్లాలోనే ఏర్పాటు చేయాలని రాయలసీమ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో తాహసీల్దార్ జయన్నకు వినతి పత్రం అందజేశారు. రాయలసీమ రైతుల ప్రయోజనార్థం కృష్ణాబోర్డును విశాఖలో కాకుండా కర్నూలులోనే ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. సిద్దేశ్వరం వద్ద బ్రిడ్జి కం బ్యారేజ్ ఏర్పాటు చేయటం వల్ల సీమలో 20 లక్షల ఎకరాలకు సాగునీరందించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు నాగన్న, గణేష్, నర్సన్న, చంద్రశేఖర్, మధు, రాగప్ప తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు బోనాలు



చిన్నజొన్నగిరిలో బోనాలు సమర్పిస్తున్న మహిళలు

తుగ్గలి: మండల పరిధిలోని ఎద్దులదొడ్డి, గిరిగెట్ల, చిన్నజొన్నగిరి గ్రామాల్లో సుంకులమ్మ, మారెమ్మ, ముడు ముఖాల అంకాలమ్మ, సుంకులమ్మ అమ్మవార్ల దేవర ఉత్సవాలను బుధవారం ఆయా గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువ జామునుంచే ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఊరేగింపుగా వెళ్లి మహిళలు బోనాలు సమర్పించారు. దేవర ఉత్సవాలకు బంధు మిత్రులు, వివిధ పార్టీల నాయకుల రాకతో గ్రామాలు కిక్కిరిశాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తుగ్గలి, జొన్నగిరి ఎస్‌ఐలు మల్లికార్జున, రామాంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



గిరిగెట్లలో పూజలందుకున్న మూడు ముఖాల అంకాలమ్మ

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఆర్డీఓ మోహన్‌దాస్

ఆలూరు రూరల్: జగనన్న కాలనీలల్లో గృహనిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్ ఆదేశించారు. బుధవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో ఆలూరు, చిప్పగిరి, హాలహర్వి మండలాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మూడు మండలాల్లోని లేఅవుట్లలో 417 గృహ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఉగాదిలోపు వీటి నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. సాంకేతిక, బిల్లుల సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో పత్తికొండ హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గురుప్రసాద్, ఆలూరు తహసీల్దార్ మల్లికార్జున పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీ

బనగానపల్లెరూరల్: బనగానపల్లెలోని అవుకుమెట్ట వద్ద నెల్లూరుకు తరలించేందుకు సిద్ధంగా నూకల లోడుతో ఉన్న లారీని కర్నూలు విజిలెన్స్ ఎస్‌ఐ జయన్న, తహసీల్దార్ వెంకటరాముడు బృందం బుధవారం తనిఖీ చేశారు. సుమారు 600 ప్యాకెట్లు (300 క్వింటళ్ల) నూకల లోడుతో వెళుతున్న లారీలో పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని ఉన్నతాధికారులకు సమాచారం అందడంతో తనిఖీ చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. బస్తాలను కిందకు దించి ప్రతిబస్తాను తనిఖీ చేశామని మొత్తం నూకలు ఉన్నట్లు వారు తెలిపారు. సీఎస్‌డీటీ రబ్బాని, పోలీసులు జమల్, జిలాని తదితరులు ఉన్నారు.



నూకల బస్తాలను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ప్రజారంజక పాలన



సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

● వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరు టౌన్: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 8వ వార్డులో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వార్డు కౌన్సిలర్, వైస్ చైర్‌పర్సన్ దివ్యకళతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ప్రజా సంకల్ప యాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ ముఖ్యమంత్రి అయిన వెంటనే ఒక్కొక్కటిగా అమలు చేస్తూ 98 శాతం నెరవేర్చారన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో డీఈ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, కార్యదర్శి దొరబాబు, వక్ఫ్ బోర్డ్ జిల్లా ఉపాధ్యక్షులు రియాజ్‌అహమ్మద్, టౌన్ బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్, కౌన్సిలర్లు కామర్తి నాగేషప్ప, వాహిద్, ఇషాక్, అమాన్, డిష్ కేశవరెడ్డి, పార్టీ నాయకుడు దేవరాజ్ పాల్గొన్నారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి

నందవరం: మండలంలో ఆయా గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ సేవలు సద్వినియోగించుకోవాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆయా గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు అందిస్తోందన్నారు. 19 నుంచి 24వ తేదీ వరకు నందవరం మండల కేంద్రంలోని సచివాలయం-2, 3 ఆధార్ సేవలు అందుబాటులో ఉంచామన్నారు. అలాగే 19 నుంచి 20వ తేదీ వరకు నాగలదిన్నె, 21 నుంచి 24 వరకు పెద్దకొత్తిలి గ్రామాల్లోని సచివాలయాల్లో ఆధార్ సేవలు ఉపయోగించుకోవాలన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

గోనెగండ్ల: నేటి నుంచి 24వ తేదీ వరకు మండలంలో ఆధార్ ప్రత్యేక క్యాంపులు ఉంటాయని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆధార్‌లో బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవడానికి ప్రభుత్వం గ్రామ సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువారం అలువాల, తిప్పనూరు, 20న చిన్నమరివీడు, తిప్పనూరు, 21న ఐరన్‌బండ, నెరుడుప్పల, 23న గాజులదిన్నె, గంజిహళ్లి, 24న పుట్టపాశం, బి.అగ్రహారం గ్రామాల్లోని ఆయా పాఠశాలల్లో ఆధార్ క్యాంపులు ఉంటాయన్నారు.

● ఆలూరు రూరల్: గురువారం ఆలూరు సచివాలయం-1, మొలగవల్లి -1 సచివాలయంలో ఆధార్ క్యాంప్ అందుబాటులో ఉంటుందని ఎంపీడీఓ అల్లబకాష్ తెలిపారు. 21, 23, 24 తేదీల్లో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవాలన్నారు. ఆధార్ అప్‌డేట్ కోసం దరఖాస్తు ఫారంలో గెజిటెడ్ సంతకం తప్పని సరిగా ఉండాలన్నారు. కొత్త ఆధార్ కార్డు ఎన్‌రోల్ కోసం దరఖాస్తు ఫారంతో పాటు బర్త్ సర్టిఫికెట్ జతపరచాలన్నారు.

● హొళగుంద: మండల కేంద్రంలో రెండు ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ దాసానాయక్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఒకటి, సచివాలయం-3లో ఒకటి చొప్పున ఆధార్ కేంద్రాలు ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు, ఫిబ్రవరి 7 నుంచి 10వ తేదీ వరకు కొనసాగుతున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

ఫిష్ ఆంధ్ర ఔట్‌లెట్‌లు ప్రారంభించాలి

ఆదోని రూరల్ : మండలానికి ఐదు చొప్పున ఫిష్ ఆంధ్ర ఔట్‌లేట్లను తప్పనిసరిగా ప్రారంభించాలని, సంస్థాగత నిర్మాణంలో భాగంగా మొబైల్ బుక్ కీపింగ్, డీసీబీ, సీఐఎఫ్ తదితర వాటిలో ప్రగతి సాధించాలని డీఆర్‌డీఏ–వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య, డీడీ ఫిషరీస్ శ్యామల సూచించారు. పట్టణంలోని మండల సమాఖ్య సమావేశ హాల్‌లో బుధవారం ఆదోని, ఆలూరు నియోజకవర్గాల ఏసీ, ఏపీఎంలు, లబ్ధిదారులకు ఫిష్ ఆంధ్ర స్కీంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన, ప్రాజెక్టు కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రధానంగా ఫిష్ ఆంధ్ర స్కీంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివిధ రకాల ఔట్‌లేట్లు నమూనాలు మరియు వాటికయ్యే ఖర్చు, ప్రభుత్వం ద్వారా వచ్చే సబ్సిడీ, యూనిట్ పెట్టుకోవడం ద్వారా వచ్చే లాభాలు.. తదితర అంశాల గురించి వివరించారు. జీవనోపాధుల్లో భాగంగా సీడ్ కేపిటల్ ప్రతి మండలం టార్గెట్‌ను పూర్తి చేయాలని, పెరటికోళ్లు, గొర్రెలు, పొట్టేళ్ల యూనిట్ల లక్ష్యాన్ని గడువులోపు పూర్తి చేయాలని, స్త్రీనిధి రికవరీని గడువులోపు పూర్తి చేయాలని, నిర్దేశించిన మండలాల్లో చేయూత, మహిళ మార్ట్ ప్రారంభించడానికి త్వరలో ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు. ఏపీడీ శ్రీధర్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ వెంకటసుబ్బయ్య

ఆర్టీసీ బస్టాండ్ తనిఖీ

ఆదోని రూరల్ : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. మరుగుదొడ్లను పరిశీలించి, టికెట్ ధరలను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులతో మాట్లాడి సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. అనంతరం డీఎం రఫీక్‌తో చర్చించా రు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, అలాగే బస్టాండులో ప్రయాణికులు కూర్చొనేందుకు సీట్లు ఏర్పాటు చేయాలని, పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. ఆర్టీఓ కార్యా లయ పరిపాలనాధికారి గోవిందసింగ్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రజనీకాంత్ రెడ్డి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

మండగిరి సచివాలయం తనిఖీ..

మేజర్ పంచాయతీ మండగిరిలోని సచివాలయం-2ను బుధవారం సాయంత్రం సబ్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో ప్రభుత్వ పథకాల బోర్డుల ఏర్పాటు, సిబ్బంది పనితీరు, బయోమెట్రిక్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీఓ గీతావాణి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



బస్టాండ్‌లో సౌకర్యాలపై డీఎంతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్